SURYA

# దళిత ఐఏఎస్, ఐపిఎస్ ఆఫీసర్ల

# హాస్టల్ బాట

**హైదరాబాద్, డిసెంబర్ 7 (మేజర్ న్యూస్)**

హాస్టళ్లలో ఉండి చదువుకుని ఐ.ఎ.ఎస్.లు, ఐపిఎస్.లు అయ్యాం. ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్నాం. అయినా దళితుల కష్టాలను తీర్చలేకపోయాం. ఇకనైనా ఈ హోదాలు, హంగులు, ఆర్భాలను పక్కనపెట్టి ఏదో ఒకటి చేసి చూపించాలి.... రిటైర్ సీనియర్ ఐఎఎస్ అధికారి కాకి మాధవరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఎస్సీ, ఎస్టీ ఉన్నతాధికారుల సామాజిక న్యాయవేదిక సమావేశంలో వెల్లడైన ఏకాభిప్రాయం. సమావేశంలో పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ ఐఎఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్ ఉన్నతాధికారులు దళిత, బహుజనులకు అన్ని రకాలుగా జరుగుతున్న అన్యాయాలపై అసహనాన్ని వ్యక్తంచేశారు. సంక్షేమ వసతిగృహాల దయనీయ పరిస్థితులపై చర్చించి, ఎమ్మెల్యేలంతా ఒకరోజు హాస్టళ్లలో ఉండాలని ప్రతిపాదించినా వారి నుంచి సరైన స్పందన రాకపోవడం పై సమావేశంలో చర్చించారు. ప్రతినెలా సమావేశం కావడం, చర్చించడం పరిపాటి అయిందే తప్ప మన పిల్లలకు మనం ఏ మేరకు దగ్గరగా ఉన్నామో ఆలోచించాలంటూ ఒక ఉన్నతాధికారి వేసిన ప్రశ్న అందరిని ఆలోచనలో పడేసింది. బి.ఆర్.అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ ఫలాల పుణ్యంతో తామంతా హాస్టళ్లలో ఉండి చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డామని, కీలక స్థానాల్లో ఉండి కూడా తర్వాత తరానికి ఏమి చేయకపోవడం మంచిది కాదని, ఏదో ఒకటి చేయాలని మరో సీనియర్ ఐఎఎస్ సూచించారు. ప్రతి ఒక్కరూ కనీసం పదివేల రూపాయల చొప్పున విరాళాలు సేకరించి ఒక నిధిని ఏర్పాటుచేయాలని సమావేశంలో ప్రతిపాదించారు. ఎస్సీ, ఎస్టీ ఉన్నతాధికారుల సామాజిక న్యాయవేదిక రిజిష్టర్ చేసినట్లయితే తమ వర్గాల వారికి జరుగుతున్న అన్యాయాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగలమని మరొకరు సూచించారు. ఇక నుంచి అణగారిన వర్గాల ఐఎఎస్, ఐపిఎస్ లతోపాటు ఉన్నతాధికారులందరూ సంక్షేమ వసతిగృహాల్లో అక్కడి విద్యార్థులతో పాటు గడపాలని నిర్ణయించారు. సర్వీసుల్లో ఉన్న అధికారులు జిల్లా పర్యటనల్లో భాగంగా హాస్టళ్లను సందర్శించి ఆరోజు రాత్రి అక్కడే బసచేసి విద్యార్థుల్లో నైతిక స్థైర్యాన్ని పెంచాలని, ఆ విధంగానైనా ప్రభుత్వ ప్రాధాన్యతల్లో హాస్టళ్లు చేరే అవకాశం ఉందని, వచ్చే 2008..09 వార్షిక బడ్జెట్ లో సంక్షేమ రంగానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చే విధంగా బడ్జెట్ రూపకల్పనల్లోనూ దళిత ఐఎఎస్ అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉందని మరో అధికారి సూచించారు.

ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం కొత్తగా ఏర్పాటుచేసిన నోడల్ ఏజెన్సీలు ఆశించిన స్థాయిలో లేవని, వీటి వల్ల దళితులకు ఒరిగేదేమి లేదని సమావేశం అభిప్రాయపడింది. ప్రభుత్వ విభాగాల్లో ఔట్ సోర్సింగ్ వల్ల దళితులకు తీరని అన్యాయం జరుగుతుందని, రిజర్వేషన్లు నిర్వీర్యం అయ్యే పరిస్థితి నెలకొందని సమావేశం ఆందోళన వ్యక్తంచేసింది.